

# ప్రమాదం జాగ్రత్త!

## - కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

**ప్రమాణస్వీకారం,** యిత్యాది లాంఛనాలు ముగిసిన తరువాత, "వింగ్ కమాండర్ ముఖర్జీ చిన్నపిల్లలయిన మీ ఇద్దరి పిల్లల్నీ బోను యెక్కించి, వాళ్ళ లేత మనస్సులని బాధించడం యిష్టంలేదు. మై లర్నెడ్ ఫ్రెండ్ డిఫెన్స్ కౌన్సిల్ కూడా అంగీకరిస్తారనుకుంటాను. మీ భార్యని ఎత్తుకుపోయిన మనిషి ఆనవాలు మీ పిల్లలు మీకు వివరంగా చెప్పివుండాలి. దయచేసి ఆ వివరాలు చెప్పగలరా?" అడిగాడు ప్రాసిక్యూటర్.

యుగంధర్ అభ్యంతరం చెప్తుతారని అందరూ ఎదురు చూశారు. కానీ మౌనంగా కూర్చున్నాడు.

"క్షమించాలి. నేనేమీ చెప్పలేను" అన్నాడు ముఖర్జీ.

"అంటే?" అడిగాడు ప్రాసిక్యూటర్.

"ఈ కేసులో నేను సాక్ష్యం చెప్పదలచుకోలేదు" అన్నాడు ముఖర్జీ.

"మీ మనస్సులో బాధ, క్షోభ, నాకూ, అందరికీ అర్థమవుతుంది. కానీ, ఒక ఘాతుకమైన హత్య చేసిన మనిషికి, అందులోనూ మీ భార్యని, తగిన శిక్షపడడంలో మీరు ప్రభుత్వానికి సహాయం చేయడం, కనీస పౌరధర్మం అని జ్ఞప్తిచేస్తున్నాను" అన్నాడు ప్రాసిక్యూటర్.

"పౌరుడిగా నా బాధ్యత నాకు తెలుసు. షీల భర్తగా ఆమె ఆత్మశాంతికి ఏం చేయాలో కూడా నాకు తెలుసు. దయచేసి నన్ను నిర్బంధించకండి" అన్నాడు ముఖర్జీ.

"ఆల్‌రైట్ యు ఆర్ ఎక్స్‌క్యూజ్‌డ్" చెప్పాడు ప్రాసిక్యూటర్. ముఖర్జీ బోను దిగబోతున్నాడు. "క్షమించండి. ఒక్క నిమిషం" అన్నాడు యుగంధర్ లేచి నిలబడి.

"అభ్యంతరం యువర్ ఆనర్. వింగ్ కమాండర్ ముఖర్జీ ప్రాసిక్యూషన్ తరపున సాక్ష్యం చెప్పలేదు. కనుక ఈ సాక్షిని క్రాసు పరీక్ష చేసే అధికారం డిఫెన్స్ కౌన్సిల్‌కు లేదు."

"మై లర్నెడ్ ఫ్రెండ్ ప్రాసిక్యూటర్ ఎవిడెన్స్ యాక్టు మరొకసారి చదువుకుంటే మంచిది. వింగ్ కమాండర్ ముఖర్జీ సాక్ష్యం యిచ్చినా ఇవ్వకపోయినా, ప్రాసిక్యూషన్ సాక్షిగా బోను ఎక్కారు, ప్రమాణ స్వీకారం చేశారు."

"చెప్పని సాక్ష్యం గురించి క్రాసు ప్రరీక్ష చేసే అధికారం లేదు" అన్నాడు ప్రాసిక్యూటర్.

"యస్! మైలర్నెడ్ ఫ్రెండ్ ఈజ్ కరెక్ట్. డైరెక్టు ఎగ్జామినేషన్‌లో సాక్షి చెప్పలేని విషయాల గురించి క్రాసు పరీక్ష చేయడానికి డిఫెన్సుకి అధికారం లేదు. అంగీకరిస్తున్నాను. కానీ ప్రమాణస్వీకారం చేసి, బోను యెక్కి సాక్ష్యం చెప్పడానికి ఎందువల్ల నిరాకరిస్తున్నదీ, తెలుసుకోవడానికి క్రాసు పరీక్ష చేసే అధికారం డిఫెన్సుకు వున్నదని కోర్టువారికి మనవి చేసుకుంటున్నాను"

"దటీస్ ఎ గుడ్ పాయింట్" వ్యాఖ్యానించాడు ఒక సీనియర్ క్రిమినల్ లాయర్.

"ప్రొసీడ్" అన్నాడు మేజిస్ట్రేటు.

"ఆ ముగ్గురూ యెక్కడున్నారో, వాళ్ళపేర్లు నాక్కావాలి. వారిని గురించి తగిన జాగ్రత్త తీసుకోవాలి. కావలిస్తే మిలటరీ యింటలిజెన్స్ డైరెక్టర్ నుంచి మీకు అధికారపూర్వకంగా ఉత్తరం తెప్పించి పంపిస్తాను" అన్నాడు రాజు.

"నో! నో! అవసరంలేదు. మీ మాట మీద ఆ మాత్రం నమ్మకం లేదంటారా! ఈ మిలటరీ యింటలిజెన్స్ వారికి గందరగోళం యెక్కువ. వాళ్ళని యెక్కడికి పంపాలో వాళ్ళే నాకు ఆర్డర్స్ పంపుతారు. ఇప్పుడు మళ్ళీ ఆ విషయం చెప్పమంటారా? ఫైల్స్ చూసుకుంటే వాళ్ళకే తెలిసేది. వాళ్ళ పేర్లు చెపుతాను వ్రాసుకోండి. జాన్సన్, భరత్, నాయక్. ఆ ముగ్గుర్ని డిఫెన్స్ మంత్రి తన సెక్యూరిటీ స్టాఫ్‌లోకి తీసుకున్నారు. డిఫెన్స్ మంత్రి గదికి కాపలాగా" అన్నాడు మేజర్ ఆనంద్.

"థాంక్యూ ఫైల్లో వున్న విషయం మరచిపోయి ఇంత హడావుడి చేయడం అనవసరం. డిఫెన్స్ మంత్రి సెక్యూరిటీ ఆఫీసర్లుగా వున్న వారిని యుగంధర్ యెలా పట్టుకుంటారు. వాళ్ళ పిచ్చికానీ" అన్నాడు రాజు.

"క్షమించాలి. అటు ప్రాసిక్యూషన్ తరఫున కానీ, యిటు డిఫెన్స్ తరఫున కానీ నేను యెటువంటి సాక్ష్యం చెప్పదలచుకోలేదు" అన్నాడు ముఖర్జీ.

"యువర్ ఆనర్! అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పమని కోర్టువారు సాక్షికి ఆదేశం యివ్వమని ప్రార్ధిస్తున్నాను" అన్నాడు యుగంధర్.

అంతలో గడియారం మోగింది. "కేసు రేపటికి వాయిదా వేయబడింది. వింగ్ కమాండర్ ముఖర్జీ రేపు కోర్టులో హాజరు కావలసింది" అన్నాడు మేజిస్ట్రేట్.

అందరూ లేచారు. ఈ రోజు యెలా తప్పించుకోవడం. మళ్ళీ మేజిస్ట్రేట్, ఈ పాటికి పోలీసులకి ఆ విషయం తెలిసే వుంటుంది. వెయ్యి కళ్ళతో కాచుకుంటారు. 'షూట్ ఆన్ సైట్' నవ్వుకున్నాడు యుగంధర్. వసారలో వున్న టెలిఫోన్ బూతులోకి వెళ్ళి టెలిఫోన్ కాల్ చేశాడు అక్కడే నిలుచున్నాడు తరువాత. కోర్టు ఆవరణలో వున్నంతసేపూ పోలీసులు తనని ఏమీ చెయ్యడానికి వీలులేదు. అరగంట తర్వాత ఒక కారు వచ్చి వసార దగ్గర ఆగింది. ఒక డాక్టరు, ఒక నర్సు దిగారు. వాళ్ళు రావడం చూసి యుగంధర్ నేలమీద పడిపోయి ఛాతీ పట్టుకుని మూలగడం ప్రారంభించాడు.

"ఏమిటి యుగంధర్? ఏమైంది?" అడిగాడు డాక్టర్.

"నెప్పి, విపరీతమైన నొప్పి" అన్నాడు యుగంధర్.

డాక్టర్ యుగంధర్ నాడి పరీక్ష చేసి "హార్ట్ ఎటాక్. ఎంత తీవ్రమయిందో తెలీదు, వెంటనే మా ఆస్పత్రికి తీసుకెళ్ళాలి" అని నర్సు డాక్టర్ కలిసి యుగంధర్‌ని కారులో ఎక్కిస్తున్నారు.

"డాక్టర్ యుగంధర్‌ని అరెస్ట్ చెయ్యడానికి ఇదిగో అరెస్ట్ వారెంట్" అన్నాడు ఏ.సి.

"సారీ పేషెంట్ ప్రస్తుతం నా ఆధీనంలో వున్నారు. వారెంట్ వున్నాకానీ మీకు అప్పగించలేను. చికిత్స చేసిన తరువాత" కమీషనర్ నవ్వి "సరే పేషెంట్‌ని జాగ్రత్తగా చూసుకోండి. మేమూ చూసుకుంటాము. పోలీసులు గదికి కాపలా వుంటారు" అన్నాడు.

కారులో వెళుతున్నారు "యుగంధర్ నన్ను యిబ్బందిలో.." అంటున్నాడు డాక్టర్.

"ఏమీ యిబ్బందిరాదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మీకు తెలియకపోవచ్చు కానీ మెడికల్ జూరిస్ప్రుడెన్స్ మీకు తెలుసుగా. బయట పోలీసులు కాపలా వుండగా పేషెంట్‌ని కనిపెట్టి వుండటం మీ బాధ్యతకాదు" అన్నాడు యుగంధర్.

ఆ రాత్రి ఎనిమిది గంటలకి యుగంధర్ గదిలోకి ఒక డాక్టరు వెళ్ళాడు. పది నిమిషాల తరువాత డాక్టర్ బయటికి వెళ్ళిపోయాడు. మర్నాడు ప్రొద్దున్న ఏ.సి పోలీసు బలగంతో వచ్చి, "హల్లో డాక్టర్ పేషెంట్ యెలా వున్నారు?" అడిగాడు.

"చాలా మైనర్ స్ట్రోక్. రాత్రే తగ్గిపోయింది. ఇంకా నేను చూడలేదు. యివ్వాళ రండి వెళ్ళి చూద్దాం"

"థాంక్యూ మీ సహకారానికి" అన్నాడు ఏ.సి.

అందరూ రోగి గదిలోకి వెళ్ళారు. గదిలో యుగంధర్ లేడు. ఒక డాక్టర్ కుర్చీలో వున్నాడు. నోటిలో గుడ్డపేలికలూ, చేతులూ కాళ్ళూ కట్టబడివున్నాయి.

"యుగంధర్ ఏరి?" అడిగాడు ఎ.సి డాక్టరుకి కట్లు విప్పారు.

"రాత్రి బి.పి చూడడానికి వచ్చాను. నన్ను తలమీద ఒక దెబ్బకొట్టి"

ఏ.సి మండిపడిపోయాడు.

బయట కాపలా వున్న పోలీసులు మీద విరుచుకుపడ్డాడు. "పోనీ! ఈ రోజు కోర్టుకి యెలా వస్తాడు."

రాజు పాలం విమానాశ్రయంలో దిగాడు. రక్షణమంత్రికి సెక్యూరిటీ భటులుగా వున్న వాళ్ళని తను ఎలా పట్టుకోవడం. యెలా ముగ్గుర్ని బొంబాయికి తీసుకెళ్ళడం. యుగంధర్‌ని సలహా అడగడానికి కూడా అవకాశం లేకపోయింది. ఒకటే మార్గం. సాహసించాలి. జీరో కార్యాలయం యెక్కడో యుగంధర్ చెప్పారు. జీరోనే ఉపయోగించుకోవాలి. చీకటి పడేంతవరకూ రాజు వీధుల్లో తిరిగి, రాత్రి తొమ్మిది గంటలవేళ జీరో షాపుకి వెళ్ళి తలుపు తట్టాడు. శిఖామణి కేసు గురించి ఏదో తలకిందులయి వుంటుంది. బహుశా డిఫెన్స్ మంత్రి వచ్చి వుంటాడని జీరో తలుపు తీశాడు. అంతే - రాజు, జీరోని చెయ్యి పట్టుకుని, మెలితిప్పి, తలుపు మూసి, లోపలికి తీసుకెళ్ళాడు. తను తెచ్చుకున్న సంకెళ్ళు జీరో చేతులకి వేసి, "మిస్టర్ జీరో బహుశా నేను యెవరో మీకు తెలియదనుకుంటాను" అన్నాడు రాజు.

ఎవడు వీడు? తన రహస్య కార్యాలయం వీడికెలా తెలిసింది?

"నా పేరు రాజు. డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంట్‌ని."

అప్పుడర్థమయింది జీరోకి. నవ్వాడు. "మిస్ట రాజూ! మీరూ కూర్చోండి. వచ్చిన కారణం?" అడిగాడు. రాజు జీరోతో కాస్సేపు మాట్లాడాడు. ముఖ్యమైన విషయాలు కావు.

"అప్రస్తుత విషయాలు మాట్లాడుతున్నారు. అసలు" అంటున్నాడు జీరో.

"థాంక్యూ. మీరేం సహాయం చేయవలసిన అవసరంలేదు" అంటూ టెలిఫోన్ రిసీవర్ తీశాడు. కంఠస్వరం మార్చడంలో రాజు ప్రవీణుడు. జీరో కంఠస్వరంలా మార్చి, "జీరో హియర్" అన్నాడు.

"ఈ రాత్రివేళ ఏమిటి అవసరం?" అడిగాడు డిఫెన్స్ మంత్రి.

"మీ సెక్యూరిటీ సిబ్బందిలో ముగ్గురు జాన్సన్, భరత్, నాయక్ ఆ ముగ్గుర్నీ వెంటనే నాకు అప్పగించాలి."

"ఎందుకూ?" అడిగాడు డిఫెన్స్ మంత్రి.

"జీరో ఊరికే అడగడు, అవసరమైతే తప్ప. ఇంకా తెలియదు. శిఖామణి కేసు మలుపు తిరుగుతోంది. లిక్విడేషన్"

"గుడ్ గాడ్" అన్నారు మంత్రి.

"అవసరమైతేనే, ఆ ముగ్గుర్నీ ఒక నల్లని కారులో వెంటనే బయలుదేరమనండి. కన్నాట్ సర్కిల్ దగ్గర కారు మద్రాసు కేఫ్ ముందు ఆపి వుంచమనండి. నేనే స్వయంగా వెళతాను. జీరో డబుల్ జీరో అంటాను. అదే గుర్తు. ఆ తరువాత నా ఆజ్ఞలు పాటించమని చెప్పండి."

"ఎస్" ఫోన్ పెట్టేశాడు డిఫెన్స్ మంత్రి. రాజు జేబులోంచి సిరంజి తీశాడు. "మిస్టర్ జీరో ఒక ఇరవైనాలుగు గంటలు తిండీ నీళ్ళూ లేకపోతే మీ ప్రాణానికి ఆపద ఏమీ లేదు" అంటూ జీరోకి యింజెక్షన్ ఇచ్చాడు రాజు. జీరో మర్నాటి రాత్రి వరకు నిద్దరలేవడు. తనకి యింక ఆటంకం లేదు.

ఒక వృద్ధుడు కర్ర పట్టుకుని, తెల్లపంచ, లాల్చీ, నెరసిన గడ్డమూ ఒంగి నడవలేక నడుస్తున్నాడు.

మేజస్ట్రేటు కోర్టుగేటు దగ్గర అతన్ని పోలీసులు ఆపారు.

"ఎక్కడికి?" అడిగారు.

"నా పేరు గులాబ్‌చంద్. వడ్డీ వ్యాపారస్థుడ్ని. అనవసరంగా నా మీద కేసు పెట్టారు."

"ఈ రోజు అటువంటి కేసులు యేమీ లేవు."

"మీరు చెపుతారు. బాగానే వుంది. నేను వకీలుకి డబ్బు యిచ్చుకున్నాను. వకీలు రమ్మన్నాడు" అని ఆ వృద్ధుడు తడపడుతూ వెళ్ళాడు లోపలికి. ఆ వృద్ధుడే డిటెక్టివ్ యుగంధర్ అని పోలీసులకి తెలియదు. నల్లకోటు వేసుకుని కోర్టులో యుగంధర్ హాజరయ్యేటప్పటికి ఏ.సి.కి యితర పోలీసు ఆఫీసర్లకి ఆశ్చర్యం యింతా అంతా కాదు.

"ప్రమాణ స్వీకారం చేసి బోను ఎక్కిన తర్వాత సాక్ష్యం ఏమీ చెప్పనని సాక్షి అనడానికి కారణం ఏమిటి? క్రాసు పరీక్ష చెయ్యడానికి డిఫెన్సుకి అధికారం వుంది" అన్నాడు మేజిస్ట్రేటు.

"థాంక్ యు. యువర్ ఆనర్. మిస్టర్ ముఖర్జీ ప్రాసిక్యూషన్ తరఫున సాక్ష్యం యివ్వ నిరాకరించడానికి కారణం చెప్పగలరా?" అడిగాడు యుగంధర్. ముఖర్జీ మౌనం వహించాడు.

"ఒక నిర్దోషిని తప్పుడు సాక్ష్యం చెప్పి వురికంబం యెక్కించడానికి మీ అంతఃకరణ అంగీకరించకపోవడమా?" అడిగాడు యుగంధర్. ముఖర్జీది మౌనవ్రతం.

"మీ భార్య షీలా ముఖర్జీని హత్య చేసింది శిఖామణి కాదనీ, శిఖామణి మీద సాక్ష్యం అంతా ప్రాసిక్యూషన్ సృష్టించినదే అని మీకు తెలిసి వుండడం, అసలు హంతకులు ఎవరో కూడా తెలియడం కూడా కారణమా?" ముఖర్జీది యింకా మౌనమే.

"యువర్ ఆనర్ సాక్షి ఏ ప్రశ్నకీ సమాధానం చెప్పడంలేదు. కనుక ఈ సాక్షి వింగ్ కమాండర్ ముఖర్జీవి, ఈ కేసు గురించి తనకు తెలిసిన విషయాలు ఒకరితో చెపుతున్నప్పుడు, ఆ మాటలు రికార్డు చేయబడ్డాయి. కోర్టువారి అనుమతితో. టేప్ రికార్డర్" అంటూ యుగంధర్  టేప్ రికార్డర్ తీస్తున్నాడు.

"యువర్ ఆనర్! అభ్యంతరం. సాక్షి యెప్పుడో, ఎవరితో ఆ మాటలు ఏ సందర్భంలో చెప్పినదీ వివరించనిదే ఆ టేపు రికార్డ్‌లోని మాటలు సాక్ష్యంగా అంగీకరించడం చట్టానికి విరుద్ధం."

"యువర్ ఆనర్! అవసరమయితే తప్పకుండా వివరిస్తాను. అసలు టేప్ రికార్డర్ ఆన్ చెయ్యకుండానే సాక్షి తనంతట తనే చెబుతారని ఆశిస్తాను" అంటున్నాడు యుగంధర్. అంతలో కోర్టులో సంచలనం.

రాజు కారు యెక్కి గుర్తు చెప్పగానే ముగ్గురు ఆర్మీ జవానులు సెల్యూట్ చేశారు. "టేంక్ పెట్రోలుతో నింపారా?" అడిగాడు రాజు.

"లేదు."

"డ్రయివ్ చెయ్యండి. దగ్గర వున బంక్‌లో ఆపి నింపండి. తరవాత తిన్నగా ఆపకుండా బొంబాయి వంతుల మీద కారు డ్రయివ్ చెయ్యండి. పొద్దునకల్లా బొంబాయి చేరుకోవాలి.

"ఎందుకు సార్?"

"ప్రశ్నలు వేయకూడదని మంత్రిగారు చెప్పలేదా?"

"చెప్పారు."

సూర్యోదయానికి ముందే బొంబాయి చేరుకుంది కారు. తిన్నగా కారు మేజర్ భట్టాచార్య యింటివద్దకు తీసుకెళ్ళాడు రాజు. "దిగండి రండి" అన్నాడు. ముగ్గురూ దిగారు. రాజు ఇంకా భట్టాచార్య వేషంలోనే వున్నాడు. ఆర్డర్లీ వచ్చి రాజుకి సెల్యూట్ చేశాడు. ఆ ముగ్గురినీ హాల్లో కూర్చోమని, రాజు ఆర్డర్లీని పక్కకి తీసుకెళ్ళి "ఆమె -"

"పడకగదిలోనే వున్నారు సార్. నేను వెళ్ళలేదు. ఆమె బయటికి రాలేదు."

"గుడ్ నాకు ప్రమోషన్ వచ్చింది. మిలటరీ ఇంటిలిజెన్స్. ఈ ముగ్గురి చేత కొంత నిజం కక్కించాలి. శత్రువులకి రహస్యాలు చెప్పారట. కొట్టు గదిలోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టు. నేనూ వస్తాను" అన్నాడు రాజు.

"యస్ సార్" అని ఆర్డర్లీ, ఆ ముగ్గుర్నీ చిన్న గదిలోకి తీసుకెళ్ళాడు. వాళ్ళ వెనకే వెళ్ళాడు రాజు. ఆ ముగ్గురూ, ప్రమాదం వాటిల్లనున్నదనుకునే ముందే రాజు అరక్షణంలో ఒక్కొక్కర్నీ మెడమీద గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకి వాళ్ళు స్పృహ తప్పి క్రిందపడ్డారు.

"తాళ్ళతో గట్టిగా వీళ్ళ చేతులూ కాళ్ళూ కట్టు. నోరు మెదపనివ్వక. యిప్పుడే వస్తాను" అని రాజు గదిలోంచి బయటికి వెళ్ళాడు.

కోర్టులోకి శిఖామణి భార్య రాధ రావడంవలననే సంచలనం కలిగింది. "ఆర్డర్! ఆర్డర్" అన్నాడు మేజిస్ట్రేట్.

"యువరానర్ మనస్సు బాగోలేక తప్పతాగిన తరుణంలో నేను ఎవరితోనో యేదో మాట్లాడి వుండవచ్చు. ఆ మాటలు సాక్ష్యంగా ప్రవేశపెడుతున్నందుకు నేను అభ్యంతరం చెప్పుతున్నాను" అన్నాడు ముఖర్జీ.

"అదేనా కారణం, లేక పై అధికారుల ఆజ్ఞలు ఉల్లంఘిస్తే శిక్ష పడుతుందని భయమా?" అడిగాడు యుగంధర్ నవ్వుతూ. ముఖర్జీ తలవంచుకున్నాడు.

"మైడియర్ ఫ్రెండ్ భట్టాచార్య. మిమ్మల్ని యిలా మోసం చేసి ఒక గదిలో నిర్బంధించినందుకు వెయ్యి క్షమాపణలు. ఒక మంచి పనికోసం యిలా చేయవలసి వచ్చింది. అదేదో మీకు కాసేపట్లో అర్ధమవుతుంది" అంటూ మేజర్ భట్టాచార్య తప్పించుకోకుండా అతని చేతులకు సంకెళ్ళు వేశాడు రాజు.

"కాత్యా! ఆర్డర్లీని ఏదో మిషమీద బయటికి పంపిస్తాను. తరువాత నువ్వు మేజర్ని కొట్టు గదిలోకి తీసుకురా! ఆ గది వంట గది పక్కనుంది" అని రాజు వెళ్ళిపోయాడు.

"నువ్వు బజారుకి వెళ్ళి ఈ సామాను తీసుకురా. ఒక రెండుగంటలవరకూ తిరిగి రానవసరంలేదు. రావద్దు .నాకు వీళ్ళతో పనున్నది" అన్నాడు రాజు ఆర్డర్లీతో.

"నా సహాయం"

"అవసరంలేదు. ముగ్గుర్నీ నేను కాచుకోగలను" అన్నాడు రాజు. ప్రవేశించాడు కొట్టుగదిలోకి.

కాత్యా, మేజర్ భట్టాచార్య కొట్టుగది సమీపించేసరికి లోపల నుంచి మూలుగులు, ఏడుపులు వినిపిస్తున్నాయి. భట్టాచార్య, కాత్యా కొట్టుగదిలోకి ప్రవేశించారు. రాజు బూటు కాలితో తంతున్నాడు వాళ్ళని. ఇద్దరికి పళ్ళువూడి నోటిలోంచి రక్తం కారుతోంది. ఒకడికి ముక్కుపచ్చడై రక్తమయమయింది.

"ఊ!ఊ నిజం చెప్పండి. ఏం జరిగింది? లేదా" మళ్ళీ కాలెత్తాడు రాజు.

"చెపుతాము" అన్నాడు ఒకడు. రాజు టేప్ రికార్డర్ ఆన్ చేశాడు.

ముగ్గురు జవాన్లని మెడపట్టుకుని లోపలకి తీసుకు వస్తున్న రాజుని, కాత్యా, భట్టాచార్యని చూసి కోర్టులో కలవరం బయలుదేరింది.

"ఆర్డర్! ఆర్డర్ ఏమిటీ గొడవ? యెవరు వీళ్ళు?" మేజిస్ట్రేట్ అడిగాడు.

రాజు యుగంధర్ దగ్గరకి వెళ్ళి చెవిలో యేదో చెప్పాడు.

"యువరానర్! క్షమించాలి. ఈ గొడవకి కారకుడ్ని నేనే. షీలా ముఖర్జీని హత్య చేసింది శిఖామణి కాదని విరుద్ధ సాక్ష్యంతో, వాదనతో, శిఖామణిని విడుదల చేయించడమే డిఫెన్స్ బాధ్యత అయినా 'షూట్ ఆన్ సైట్' అని నా గురించి అధికార్లు ఆజ్ఞలు యివ్వడంవల్ల, షీలాముఖర్జీని నిజంగా యెవరు హత్య చేశారో నిరూపించడమే, శిఖామణి నిర్దోషి అని నిరూపించడం అవుతుందని భావించి అసలు హంతకుల్ని పట్టుకుని యిక్కడికి రప్పించాను"

"యువర్ ఆనర్ అభ్యంతరం. యిది సరైన విధానం కాదు" అన్నాడు ప్రాసిక్యూటర్.

"అబ్జక్షన్ వోవర్ రూల్డ్. ప్రోసీడ్"

"కోర్టులోకి తీసుకురాబడ్డ ఈ ముగ్గురు ఆర్మీ జవానులు షీలా ముఖర్జీని హత్య చేశారు. వాళ్ళు యిచ్చిన వాఙ్మూలం రికార్డు చేయడమే కాక వ్రాత మూలకంగా తీసుకుని మేజర్ భట్టాచార్య, ఆయన ఆర్డర్లీ చేత సాక్షి సంతకాలు పెట్టించాము. ఇదిగో కోర్టువారి అనుమతితో ఆ పత్రం దాఖలు చేస్తున్నాను. ఇప్పుడు కోర్టువారి అనుమతితో -"

"అభ్యంతరం యువర్ ఆనర్. డిఫెన్స్ వద్ద ఇటువంటి సాక్ష్యం వుంటే ప్రాసిక్యూషన్‌కి తెలియజేయవలసింది" అన్నాడు ప్రాసిక్యూటర్.

"సామాన్యమైన కేసు అయితే ఆ పద్ధతే అవలంభించేవాణ్ణి. కానీ పరిస్థితులు వేరు."

"ప్రోసీడ్" అన్నారు మేజిస్ట్రేట్.

యుగంధర్ టేప్ రికార్డర్ ఆన్ చేశాడు.

"నా పేరు నాయక్. జాన్సన్, భరత్, నేను ఒకరోజు సాయంకాలం ఎగ్జిబిషన్‌కి వెళ్ళాం. అక్కడ మాకు జరిగిన పరాభవం తట్టుకోలేకపోయాం. అంతేగాక అందమైన షీలాముఖర్జీ వొళ్ళు స్ఫురించాక మా వాంఛ తీవ్రమయింది. ఆమెని పొందాలనీ, అనుభవించాలనీ, కోర్కె ప్రబలమయింది. మర్నాడు సాయంకాలం, ఆమె పిల్లలతో సినిమాకు వెళ్ళడం చూశాము. భరత్‌ని ఆమె సరిగా చూడలేదు. అతను వెళ్ళి ఐస్‌క్రీం పార్లర్ వద్ద ఆమెని కలుసుకుని, ఆమె భర్త గాయపడ్డారని అబద్ధం చెప్పి కారు యెక్కించుకుని, ట్రంక్‌రోడ్డు మీదకు తీసుకెళ్ళి, పిల్లల్ని దింపేసి, మరికొంత దూరం వెళ్ళి ఒకచోట కారు ఆపి, పొదల మధ్యకి ఆమెని లాక్కువెళ్ళి, మేం ముగ్గురం వంతులమీద మా వాంఛను తీర్చుకున్నాం. ఆమెని ప్రాణాలతో వదిలిపెడితే మమ్మల్ని గుర్తుపడుతుందని ఆమెని అక్కడే హత్య

చేశాం. మేము ముగ్గురం సమాన నేరస్థులం" ఇసుక పడితే చప్పుడయ్యేంత నిశ్శబ్దం కోర్టులో నిమిషంపాటు. ఆ నిశ్శబ్దం బద్దలయింది. సాక్షి బోనులో నిలబడ్డ ముఖర్జీ ఒక్క గంతున వచ్చి ఆ ముగ్గురిలో ఒకడి మెడ పట్టుకుని అరవడంతో అందరూ కలసి ముఖర్జీని పక్కకు లాక్కెళ్ళి కూర్చోబెట్టారు.

"యువర్ ఆనర్ ఒక్కొక్కప్పుడు ఉన్నతాధికారంలో వున్నవారు కూడా పొరపాట్లు చేస్తారు. ఈ ముగ్గురు ఆర్మీ జవానులు ఈ ఘాతక చర్యని చేశారని తెలిస్తే, అంటే, ఏర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ భార్యని యిద్దరి పిల్లల తల్లిని మానభంగం చేసి చంపేశారని తెలిస్తే, ఏర్‌ఫోర్స్‌లో వున్న దేశ రక్షణ సిబ్బందికి ఆర్మీకి వైరం పెరిగి ఒక రకమైన అంతర్ యుద్ధం రావచ్చుననీ భావించి, అధికారులు ఈ నిజాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించారు. ఈ నేరం చేసిన మనిషిని పట్టుకోకపోతే ప్రజలకి ప్రభుత్వం మీద విశ్వాసం పోతుందనీ, పాత నేరస్థుడైన శిఖామణి మీదకి ఈ నేరం తోసి తప్పుడు సాక్ష్యం సృష్టించారు. దేశ క్షేమం కోసమే అధికారులు ఇలా మన దేశ రక్షణ సిబ్బంది ఈ విషయమై తమలో తాము తగాదా పడి దేశాన్ని అల్లకల్లోలంలో ముంచుతారని అధికారులు అనుకోవడం పొరపాటు. భారతదేశ దేశ రక్షణ సిబ్బంది అంత అవివేకమైనదీ, మూర్ఖమైనదీ, శిక్షణలేనిదీ కాదు. ఈ నిజం నేను బయట పెడతానని నన్ను ఆటంకపరచడమే కాక, నా ప్రాణం తీయడానికి కూడా అధికారులు వెనుదీయలేదు. అదే పొరపాటు. నిజం ఎప్పుడూ యెవరికీ అపకారం చెయ్యదు. సత్యం అనేది దైవీకం" అన్నాడు యుగంధర్.

ప్రాసిక్యూటర్ అటూ యిటూ చూస్తున్నాడు. ఐ.జి. ఏ.సి ప్రాసిక్యూటర్‌కి రహస్యంగా ఏదో చెప్పారు.

"యువర్ ఆనర్. కొత్తగా ప్రవేశపెట్టబడ్డ సాక్ష్యం దృష్ట్యా ప్రాసిక్యూషన్ కేసు ఉపసంహరించుకుంటోంది. "

"మీకు ఎంతో ఋణపడి వున్నాను" అన్నాడు శిఖామణి యుగంధర్‌తో.

"యుగంధర్‌గారూ! మీ ప్రాణాలను సహితం" అంటోంది రాధ.

"ఏమో! షూట్ ఆన్ సైట్ అనే ఆర్డర్స్ వున్నాయిగా" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"క్షమించండి యుగంధర్. ఆ ఆర్డర్స్ పొద్దున్నే రద్దుచేశాము. తాత్కాలికంగా ఏర్పడ్డ వైరం మరిచిపోతారని ఆశిస్తాము. ప్రభుత్వం తరపున" అంటున్నాడు ఐ.జి.

"నో!నో! దయచేసి క్షమాపణలు వద్దు, ఎవరికి తోచినట్టు వారు వారి బాధ్యతలు నిర్వహించాము. అంతే" అన్నాడు యుగంధర్.

(సమాప్తం)

Post your comments